
సీజనల్ వ్యాధుల విజృంభణ

- లోపించిన పారిశుధ్యం
- పెరిగిన దోమల మోత
- పట్టించుకోని అధికారులు

రాయదుర్గం: వాతావరణంలో మార్పులు, పారిశుధ్య లోపం వెరసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. మురుగు ముందుకు కదలక కంపుకొడుతోంది. ఎక్కడికక్కడ దోమల సంతతి పెరిగిపోతోంది. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నా ఎక్కడా ఆ ఆనవాళ్లు లేవు. రాయదుర్గం పట్టణంలో 32 వార్డులు ఉన్నాయి. 75 వేల మంది నివసిస్తున్నారు. పారిశుధ్య పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. డ్రెయినేజీలు, నీటినిల్వలు ఉన్న ప్రాంతాల్లో దోమల నివారణ కోసం గంబూషియా చేపలు వదలడం అధికారులు విస్మరించారు. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందాయి. దోమల మోత పెరిగిపోతుండటంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువవుతోంది. దీనికితోడు పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు దోమల బెడద నుంచి ఉపశమనం పొందేందుకు జెట్ కాయిల్స్, లిక్విడ్ వినియోగిస్తున్నారు. ఇంటి బడ్జెట్‌లో అదనంగా ఈ వ్యయం పెరుగుతోంది. తమ నుంచి పన్నులు వసూలు చేసే అధికారులు మాత్రం దోమల నివారణకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని మండిపడుతున్నారు.

ఆడ దోమలే వ్యాధులకు మూలం

ఆడ దోమలతోనే అన్ని రకాల వ్యాధులు వస్తున్నాయి. ఆడ అనాఫిలస్ దోమ మలేరియాను, ఆడ క్యూలెక్స్ దోమ ఫైలేరియా, మెదుడువాపు, ఏడిస్ ఈజిప్ట్ దోమ ఎల్లో ఫీవర్, డెంగీ జ్వరం, చికన్ గన్యాను వ్యాపింపజేస్తున్నాయి. శరీరంపై రక్తం పీల్చుతూ అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. వీటి తొండం పొడవుగా ఉంటుంది. మనుషులు, జంతువుల రక్తం సునాయసంగా పీల్చేస్తాయి. ఆడ దోమ 100 రోజులు బతికితే, మగ దోమ 10–20 రోజుల్లోపు చనిపోతుంది. మగ దోమలకు మానవులు, జంతువల రక్తం పీల్చేంతగా తొండం సహకరించదు.



రాయదుర్గం పట్టణంలోని ఓ డ్రెయినేజీలో ముందుకు పారని మురుగు

ఇలా చేస్తే మేలు

- రాత్రి వేళ ప్రతి ఒక్కరూ దోమతెరలు తప్పకుండా వాడాలి. దోమలు దగ్గరకు రాకుండా ఉండేందుకు ఇటీవల మార్కెట్లోకి క్రిమి సంహారక మందుతో తయారు చేసినవి అందుబాటులోకి వచ్చాయి.
- నివాస స్థలాల నుంచి దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తపడాలి. కిటికీలు, తలుపులకు మెష్ అమర్చుకోవాలి.
- దోమల సంతతి అధికంగా ఉండే ప్రాంతాల్లో చర్మం కప్పి ఉంచేలా పొడవైన షర్టులు, నైట్ ప్యాంట్లు ధరించాలి. శరీరం వాటికి కనిపించకుండా జాగ్రత్త పడాలి.
- ఇంటి చుట్టూ ఉండే పూల కుండీలు, బకెట్లలో క్రమం తప్పకుండా నీటిని తీసేయాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు లేకుండా చూసుకోవాలి.
- ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడేగా పాటించాలి.

ఫాగింగ్ మొదలుపెట్టాం



పురపాలక సంఘం పరిధిలో మూడు ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. ఇందులో ఒకటి పని చేయడం లేదు. మిగిలిన రెండింటితో ఆయా వార్డుల్లో ముందస్తుగా నిర్ధారించుకున్న తేదీల వారీగా శానిటేషన్ అధికారి ఫాగింగ్ చేయిస్తున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ ఈ ప్రక్రియ పూర్తి చేయిస్తాం. గంబూషియా చేపలు కూడా విడుదల చేయిస్తాం. దోమల సంతతి పెరగకుండా కట్టడి చేస్తాం. దోమలబారిన పడకుండా ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

జాగ్రత్తలు అవసరం



సీజనల్ వ్యాధుల కాలం మొదలైంది. ప్రజలు జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా దోమల పట్ల ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి. ఇంటి ఆవరణలో నీటి పాత్రలను వారానికి ఒకసారి ఖాళీచేసి ఆరబెట్టుకోవాలి. చెత్తా చెదారం మురికి కాల్వల్లో వేయరాదు. మరుగుదొడ్ల గాలి గొట్టాలకు మెష్ కట్టుకోవాలి. దోమతెరలు, దోమలను పారదోలే పరికరాలను వినియోగించుకోవాలి. జ్వరం వచ్చిన తక్షణమే ఆస్పత్రిల్లో చికిత్సలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.

– మెర్సీ జ్ఞానసుధ, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రాయదుర్గం

క్లుప్తంగా

రాజీ మార్గమే రాజమార్గం



కళ్యాణదుర్గంలో ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

కళ్యాణదుర్గం: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజ మార్గమని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి కట్టే భాను అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మధ్యవర్తులు ఉంటూ కేసుల రాజీ కోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు నుంచి టీ సర్కిల్ వరకు న్యాయవాదులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జడ్జి కట్టే భాను తెలియజేశారు. ముఖ్యంగా క్షణికావేశంలో పెట్టిన కేసుల్లో ఇరు వర్గాలు రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్థసారథి, ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, న్యాయవాదులు దేవేంద్ర, పట్టాభి, బీటీ రామాంజనేయులు, భంగి రవి, దాదాఖలందర్, బీటీ తిప్పేస్వామి, ముత్యాలు, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ చెకప్‌తో ఆరోగ్యకర జీవనశైలి



పోలీసులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

కూడేరు: పోలీసులకు హెల్త్ చెకప్ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి అవకాశం ఉంటుందని సీఐ రాజు పేర్కొన్నారు. బుధవారం కూడేరు పోలీసు స్టేషన్‌లో గుంతకల్లు డివిజన్‌లో పని చేస్తున్న పోలీసు సిబ్బందికి హెల్త్ చెకప్ నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీతో పాటు ఇతర పరీక్షలను వైద్య సిబ్బంది చేశారు. ఈ సందర్భంగా సీఐ రాజు మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాల మేరకు రెండు రోజులపాటు హెల్త్ చెకప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఏవైనా ఆరోగ్య సమస్యలుంటే తొలి దశలోనే చికిత్స పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ




బాలా బాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రఘువీరారెడ్డి

కళ్యాణదుర్గం: కాంగ్రెస్ సీనియర్ నేత బాలా నరేంద్రబాబు (బాలా బాబు) మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం కళ్యాణదుర్గంలో జరిగిన అంత్యక్రియలకు మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలా బాబు భౌతికాయాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు, పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి కృష్ణమూర్తి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి తదితరులు బాలా బాబు మృతదేహం వద్ద నివాళులర్పించారు.

22న సర్వసభ్య సమావేశం

ఉరవకొండ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

అంజన్న సేవలో రాజంపేట ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి అంజన్న చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా కప్పి సత్కరించారు. ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామాంజినేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, కందేపల్లి రమేష్, కోటేశ్వర్‌రెడ్డి, రామకృష్ణ, వన్నూరుస్వామి, అంజిరెడ్డి, జగన్, బుజ్జి, ఫొటో బసవరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల మీట్

కళ్యాణదుర్గం: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివ శంకర్ అధ్యక్షతన బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ మారుతమ్మ, వైస్ ఎంపీపీలు అనురాధ, కాంతమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. సర్వ సభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తే సమస్యలు, అధికారుల వివరణలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాల్సిన మండల పరిషత్ అధికారులు ఓ కాగితంలో కార్యక్రమ వివరాలను నమోదు చేయడం కొసమెరుపు. సమావేశంలో ఆయా శాఖల అజెండా వివరాలను కూడా సభ్యులకు అందించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోందని పలువురు సభ్యులు వాపోయారు. గౌరవ వేతనం వెంటనే విడుదల చేయించాలని కోరుతూ ఎంపీటీసీలు ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నరసింహులు, సతీష్, లింగమ్మ, తిప్పమ్మ, ఫక్కీరమ్మ, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వేతనం కోసం ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీలు

ప్రైవేట్ వాహనాలపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: పట్టణంలో 26 ప్రైవేట్ వాహనాలు ఎలాంటి అనుమతులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. వారం రోజుల్లో వాహనాలపై చర్యలు తీసుకోకపోతే గుంతకల్లు ఆర్‌టీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఉరవకొండ శ్రీసాయి లైట్ మోటార్ వెహికల్ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక గవిమఠం ఆరవణిలో అనుమతి లేని ఎర్టిగా వాహనాలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ.. తాము ఆర్‌టీఓ నిబంధనలు పాటించి 3 మూడు నెలలకు ఒకసారి రోడ్ ట్యాక్స్‌తో పాటు ఇతర పన్నులు చెల్లించి నిబంధనలకు మేర వాహనాలు బాడుగకు నడుపుతున్నామన్నారు. అయితే తమ కడుపుకొడుతూ కొంతమంది అనధికారింగా ఎల్లో బోర్డులు పెట్టుకుని ఉరవకొండ నుంచి అనంతపురానికి తిప్పుతున్నారన్నారు. గతంలో ఆర్టీసీ డీఎంతో పాటు ఆర్‌టీఓకు ఫిర్యాదు చేశామని.. అయితే వారు తూతూమంత్రంగా వాహనదారులను మందలించి చేతులు దులుపుకున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రైవేట్ వెహికల్స్ అసోసియేషన్ సభ్యులు

చెవిలో పువ్వులతో నిరసన

రాయదుర్గంటౌన్: సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె నాలుగో రోజు బుధవారం కూడా కొనసాగింది. సీఐటీయూ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 13 వేల మందికిపైగా ఉన్న ఇంజినీరింగ్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర, నాయకులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలంలో 'ప్రైవేట్' బోరు



కూడేరు: ఎలాంటి అనుమతులు లేకుండా ఇటీవల కూడేరులోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో కొందరు టీడీపీ నేతలు బోరు వేయించారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు మా పర్మిషన్ లేకుండా బోరు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ప్రజలకు తాగునీటి కోసం బోరు వేశామని టీడీపీ నేతలు చెబుతూ పైస్థాయి నాయకులతో ఫోన్ చేయించినట్లు సమాచారం. దీంతో ఆర్టీసీ అధికారులు ఏమి చేయాలో దిక్కుతోచక మిన్నకుండిపోయినట్లు తెలిసింది.

కరెంటు బిల్లులపై నిలదీత

బొమ్మనహాళ్: కరెంటు బిల్లులు ఇష్టారాజ్యంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారంటూ కొలగానహళ్లి ఎంపీటీసీ సభ్యుడు కొత్తూరు తిమ్మప్ప అధికారులను నిలదీశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీలకు 21 నెలలుగా పెండింగ్ ఉన్న గౌర వేతనాన్ని వెంటనే చెల్లించాలన్నారు. ఎంఈఓ మల్లికార్జున మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల మండలంలో 843 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బు జమ కాలేదన్నారు. ఎంపీటీసీ సభ్యుడు తిమ్మప్ప మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు విద్యుత్ బిల్లులు పెంచేది లేదని చెప్పి.. ఇప్పుడు వివిధ రకాల పేర్లతో బాదుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ విజయభాస్కర్, తహసీల్దార్ మునివేలు, వైస్ ఎంపీపీలు రమేష్, నాగరత్నమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, పంచాయతీ రాజ్ జేఈఈ జగదీష్, ఏఓ సాయి కుమార్, విద్యుత్ ఏఈ లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు ఏఎన్‌ఎంల బదిలీ

గుమ్మఘట్ట: మండల కేంద్రంలో ఏఎన్‌ఎం సువర్ణ, 75 వీరాపురంలో పనిచేస్తున్న జయమ్మ బదిలీ అయినట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. బ్రహ్మసముద్రం మండలం నుంచి ఇద్దరు ఏఎన్‌ఎంలు బదిలీపై ఇక్కడికి రానున్నట్లు వెల్లడించారు.

'తొలి అడుగు'లో రోడ్ల దుస్థితి కనిపించలేదా?

బ్రహ్మసముద్రం: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ ప్రజాప్రతినిధులకు నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితి కన్పించలేదా అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ విమర్శించారు. బుధవారం ముద్దలాపురంలో మండల శాఖ మహసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా గ్రామీణ రోడ్ల పరిస్థితి ఏమాత్రం మారలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు మాటలు కట్టిపెట్టి ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి నరసింహులు, మండల కార్యదర్శి నాగరాజు నాయక్, నాయకులు రాంబాబు, ఈరన్న, నాగభూషణం, గాట్ ఈరన్న, శాంతమ్మ, హనుమక్క, రామాంజినేయులు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నాయకులు

ఎన్‌సీసీతో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు

కూడేరు: ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందితే ఉన్నత విద్యతో పాటు విస్తృత ఉద్యోగ అవకాశాలు ఉంటాయని క్యాడెట్లకు ఎన్‌సీసీ తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నరసింహ సేలాని సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 10 రోజులుగా సాగిన ఎన్‌సీసీ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీడీజీ హాజరయ్యారు. క్యాడెట్లను కలిసి శిక్షణ తీరు, సౌకర్యాలపై ఆరా తీశారు. మ్యాప్ రీడింగ్ , ఫైరింగ్, అప్టికల్‌పై ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను అభినందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో క్యాడెట్లు అలరించారు. శిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన క్యాడెట్లకు ట్రోఫీలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్, క్యాంప్ డిప్యూటీ కమాండర్ శశికుమార్, గుంటూరు, కాకినాడ, కర్నూలు, వైజాగ్ , తిరుపతి, హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, నిజామాబాద్‌కు చెందిన 650 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశుదాణా పంపిణీ

కుందుర్పి: మండల కేంద్రంలో బుధవారం పాడి రైతులకు పశుదాణా పంపిణీ చేశారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి ప్రసాద్ మాట్లాడుతూ బస్తా ధర రూ.1200కాగా 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: ఉరవకొండలో పలు ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ లక్షలాది రూపాయల ఫీజులు దండుకుంటున్నాయి. అలాంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఉరవకొండ విద్యార్థి జేఏసీ నాయకులు కోరారు. బుధవారం అనంతపురంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కూడేరు: రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి శుభకర్ తెలియజేశారు. బుధవారం ముద్దలాపురంలో ఏఓ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

రాయదుర్గంటౌన్: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని జిల్లా వృత్తి విద్య అధికారి, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉరవకొండ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, అధ్యాపకులు వీరేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'మోడల్' సీట్లపై విచారణ చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

రాయదుర్గంటౌన్: ఏపీ మోడల్ స్కూ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను పక్కనబెట్టి రాజకీయ సిఫార్సులు, అవకతవకలతో ఇష్టానుసారంగా సీట్లు కేటాయించారు. దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ బుధవారం తహశీల్దార్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. రాజకీయ సిఫార్సులతో 6, 7, 8, 9 తరగతుల్లో సీట్లు కేటాయించారన్నారు. అక్రమంగా కేటాయించిన సీట్లను రద్దు చేసి మెరిట్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు తరుణ్, మున్న, రామ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో రాజీ చేసుకోవాలి



రాయదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి కేసులు రాజీ చేసుకోవాలని రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రమ్య సూచించారు. బుధవారం పట్టణంలో 'దేశం కోసం మధ్యవర్తిత్వం'పై జరిగిన ర్యాలీకి న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యారు. జడ్జి ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. మధ్యవర్తిత్వంతో కేసుల రాజీ ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

కుందుర్పి: అపిలేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు ధనుంజయ, ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడా దుస్తుల కోసం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హసీన, స్కూల్ కమిటీ చైర్మన్ చిరంజీవి, వైస్ చైర్‌పర్సన్ పద్మక్క, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మయ్య, ఈరప్ప, రామప్ప, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తిమ్మప్ప, ఓబుళేసు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయండి

కణేకల్లు: హెచ్చెల్సీకి ఈ నెల 18న నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో ఆలస్యం చేయకుండా ఆయకట్టుకు సాగునీరివ్వాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయకట్టు భూముల్లో వరి నారు పోసుకునేందుకు పొలాలను రైతులు దుక్కి వేసి తగిన ఏర్పాట్లు చేసుకున్నారన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరందించేలా ప్రత్యేక దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

ఓటరు జాబితా తయారీపై శిక్షణ

రాయదుర్గంటౌన్: పారదర్శక ఓటరు జాబితా తయారీతో పాటు ఓటర్లలో విశ్వాసం పొందేందుకు బీఎల్‌ఓలకు జాతీయ స్థాయి శిక్షణ దోహదపడుతుందని ఈఆర్‌ఓ రవి శంకర్‌రెడ్డి తెలిపారు. వారం రోజులుగా స్థానిక డ్వామా హాలులో నియోజకవర్గంలోని బీఎల్‌ఓలకు రోజూ 50 మంది చొప్పున జాతీయస్థాయి శిక్షణ ఇస్తున్నారు. చివరి రోజు బుధవారం గుమ్మఘట్ట మండలంలోని బీఎల్‌ఓలకు శిక్షణ పొందారు. ఈఆర్‌ఓతోపాటు తహసీల్దార్ రజాక్‌వలి, ఎలక్షన్ డీటీ సుజాత హాజరయ్యారు. మాస్టర్ ట్రైనర్ వెంకటరమేష్ బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు.

ముగిసిన చిన్న మొహర్రం

రాయదుర్గంటౌన్: చిన్న మొహర్రం (కాడీ పీర్లు) రాయదుర్గంలో ముగిసింది. చివరి రోజు బుధవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కణేకల్లు: మండల కేంద్రంలో బుధవారం చిన్నపీర్ల ఊరేగింపు జరిగింది. అనంతరం పీర్లను జలధికి తీసుకెళ్లారు.

కూడేరు: కరుట్లపల్లిలో బుధవారం మొహర్రం ముగిసింది. చివరి రోజు పీర్ల జలధి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

అర్జీలపై అలసత్వం వద్దు

రాయదుర్గంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంలో అలసత్వం తగదని మున్సిపల్ డీఎంఏ సంపత్‌కుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్సులో రాయదుర్గం నుంచి కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పొలిమేరల్లో వనభోజనాలు

కుందుర్పి: మహంతపురం గ్రామంలో బుధవారం గ్రామస్తులంతా గ్రామ పొలిమేర చేరి రోజంతా అక్కడే వన భోజనాలు ఆరగించారు. గ్రామ శాంతి కోసం ఇలా ఐదేళ్లకోసారి రోజంతా గ్రామ పొలిమేరలో గడిపి సాయంత్రం ఇంటికి చేరుకుంటామని గ్రామ సర్పంచ్ జగన్, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, గ్రామపెద్దలు తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటికీ తాళాలు వేసి ఉదయం అప్పిలేపల్లి పొలిమేర వద్దకు చేరుకుని అక్కడ భోజనాలు చేసి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. ఇలా చేయడం వల్ల గ్రామ శాంతితో పాటు ప్రజల ఐక్యత చాటేందుకు ఆస్కారముందని గ్రామపెద్దలు గొల్ల ఈరన్న, రిటైర్డ్ టీచర్ దాసన్న, కామన్న పేర్కొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలి

రాయదుర్గంటౌన్: డిగ్రీ అడ్మిషన్లు తక్షణమే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఆందోళన చేపట్టారు. నాయకులు అనిల్, గణేష్, చరణ్, రాజేష్, శివారెడ్డి మాట్లాడారు.